సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం ॥ 13 ॥ ఏప్రిల్ ॥ 2023



సామాజిక సేవలో ఉద్యోగులు

ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు సామాజిక సేవ చేస్తున్నారు.. పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. - 9లో



యాదాద్రి క్షేత్రానికి భద్రత ఏదీ..

యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన ఏడాది గడిచినా పూర్తిస్థాయి భద్రతా చర్యలు చేపట్టడం లేదు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 40°/24°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

పంచ నారసింహుడికి విశేష పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన చేపట్టారు. అనంతరం శ్రీస్వామి వారికి బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అలాగే సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని మూసివేశారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ..13,17,825 సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైభవంగా ఉమామహేశ్వర గాయత్రి హవనం



గాయత్రి హవనం నిర్వహిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండనామ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహా యజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. బుధవారం ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర గాయత్రి హవనం నిర్వహించారు. ఉదయం మంగళహారతితో పూజలు ప్రారంభించి రాత్రి అఖండనామ సంకీర్తన జపంతో ముగించారు. ఉదయం, సాయంత్రం యాదాద్రి ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



వరి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుండాల : సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే పంటలకు తెగుళ్లు ఆశించకుండా అరికట్టవచ్చని ఏరువాక శాస్త్రవేత్తలు మధుశేఖర్, అనిల్ సూచించారు. బుధవారం గుండాల మండలంలోని అనంతారంలో వరి చేలను ఏరువాక శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మెడ విరుపు తెగులు, కాండం తొలుచు పురుగులను గుర్తించినట్లు తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా నూలుకూడే, ఆకారపు మచ్చలు మెడ విరుపు తెగులును మారి గింజలు తాలుగా ఏర్పడుతాయన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ లావణ్య, ఏఈఓ శ్వేత, ఎంపీటీసీ శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ సైదిరెడ్డికి అవార్డు



సైదిరెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ

భూదాన్‌పోచంపల్లి : నేర పరిశోధన, నేర నిరూపణ ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన భూదాన్‌పోచంపల్లి ఎస్‌ఐ సైదిరెడ్డి అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ రివార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే చౌటుప్పల్ డీసీపీ రాజేష్ చంద్ర కూడా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సీఐ, ఎస్‌ఐని పలువురు అభినందించారు.

తప్పని రాంగ్ రూట్.. ప్రాణాలు ఫట్!



వంగపల్లి వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవడంతో నేరుగా జాతీయ రహదారిపైకి వస్తున్న వాహనాలు

హైదరాబాద్ - వరంగల్ హైవేపై అవసరమైన చోట లేని సర్వీస్ రోడ్లు

- యూటర్న్‌ల మధ్య దూరం
- రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వాహనదారులు
- రాయగిరి నుంచి ఆలేరు పరిధిలో తరచూ ప్రమాదాలు



రాయగిరి వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

యాదగిరిగుట్ట రూరల్ : జాతీయ రహదారి ఏర్పాటైతే సుఖవంతమైన ప్రయాణం చేయవచ్చని ప్రజలు భావించినా.. ఇబ్బందులు తప్పడం లేదు. అవసరమైన చోట సర్వీస్ రోడ్లు నిర్మించకపోవడం, యూటర్న్‌ల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో వాహనదారులు రాంగ్‌రూట్ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదాల బారిన పడుతుండటంతో నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. హైదరాబాద్ - వరంగల్ హైవేపై రాయగిరి నుంచి ఆలేరు పరిధిలో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి.

రోడ్డుపైనుంచే రాకపోకలు : హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి (163) అంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు.ఈ రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై ప్రధానంగా బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట ఆలేరు మండలాలు ఉంటాయి. భువనగిరి మండల రాయగిరి పరిధి నుంచి మొదలుకుని ఆలేరు పరిధి వరకు పలు చోట్ల వాహనదారులు రాంగ్ రూట్ ప్రయాణం సాగిస్తున్నారు. యూటర్న్‌లు దూరంగా ఉండడం, త్వరగా గమ్యం చేరాలనే ఉద్దేశంతో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనికి తోడు నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు అవసరమైన గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు కూడా వేయకపోవడం తో ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయి.

ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలివే..

ఆలేరు నుంచి రాయగిరి వరకు కొన్ని స్పాట్‌ల్లో రాంగ్ రూట్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. యాదగిరిగుట్ట పరిధిలోని బాహుపేట స్టేజీ, చిన్నకందుకూరు స్టేజీ, పెద్దకందుకూరు గ్రామం, రామాజీపేట స్టేజీ, సగరం స్టేజీ, వంగపల్లి గ్రామం, జమ్మాపురం స్టేజీ, రాయగిరి పరిధిలోని హోటల్ వివేరా స్పాట్‌ల్లో రాంగ్ రూట్‌లో ప్రమాదాలు జరిగే స్పాట్‌లుగా ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



హైదరాబాద్- వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగే స్పాట్‌లను గుర్తించి బ్లింకర్స్, రేడియం స్టిక్కర్స్, లైటింగ్స్, రిఫ్లెక్టివ్ షీట్స్, బ్లింకర్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రమాదాల స్పాట్‌లకు 100 మీటర్ల దూరంలోనే జిగ్‌జాగ్ బ్యారికేడ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. రాంగ్ రూట్‌లో వెళ్లే వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు జరిగే ఎక్కువగా జరిగే చోట సర్వీస్ రోడ్లు వేయాలని, నేషనల్ అథారిటీ వారితో చర్చిస్తాం.

–శివశంకర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ, యాదగిరిగుట్ట

సర్వీస్ రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం



హైదరాబాద్ జెడిమెట్ల నుంచి గూడూరు వరకు జాతీయ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్లు, ప్రతీ ఊరుకు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేశారు.. కానీ, రాయగిరి నుంచి ఆలేరు నియోజకవర్గ పరిధిలో మాత్రం ఏ గ్రామం దగ్గర సర్వీసు రోడ్డు వేయలేదు. దీంతో రోడ్డు దాటడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు బారిన పడుతున్నాం.

–మొగిలిపాక రమేష్, రామాజీపేట

కొన్ని సంఘటనలు..

- ఈ నెలలో హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని చిలకనగర్ చెందిన పెద్ది రమేష్ (38) అతని కుమారుడు పెద్ది అభిషేక్ (14) అనే వ్యక్తులు, వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో స్కూటీపై హైదరాబాద్ వెళ్తుండగా, రామాజీపేట వద్ద గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు.



రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలు

- గత ఏడాది మేలో బాహుపేట స్టేజీ పరిధిలో రఘునాథపల్లి మండలం నిడిగొండకు చెందిన తూడి నవీన్ (25) బైక్‌పై ఆలేరు నుంచి యాదగిరిగుట్టకు వెళ్తుండగా, బాహుపేట స్టేజీ పరిధిలోకి రాగానే రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ అతని బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.
- యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన మొగిలిపాక ఉప్పలయ్య గత నెలలో రాంగ్ రూట్‌లో రామాజీపేట గ్రామం నుంచి వెంచర్‌లోనికి వెళ్తుండగా అతన్ని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన ఎడమ కాలు విరిగిపోయింది.

అనుసంధానం 94.43 శాతం పూర్తి

- కలెక్టర్ పమేలా సత్పతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అధికారులు

భువనగిరిటౌన్ : జిల్లాలో ఆధార్ అనుసంధానం 94.43 శాతం పూర్తయినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం, ఎపిక్ కార్డుల ప్రింటింగ్ ఫొటో సిమిలర్ కింద తొలగించిన ఓటర్లు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. జిల్లాలో ఆధార్ అనుసంధానం వేగంగా జరుగుతుందన్నారు. 561 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి స్థాయిలో 561 మంది బూత్‌లెవల్ అధికారులు ఉన్నారని తెలిపారు. గత మూడు నెలలుగా వచ్చిన అభ్యంతరాలు, దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ నమోదు 94.43 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. 2020 నుంచి 2022 సంవత్సరం వరకు ఫేజ్ వన్ కింద 14,750 ఎపిక్ కార్డులను పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేశామని, 2022 అక్టోబర్ నుంచి 2023 జనవరి వరకు ఫేజ్ 2 కింద 13,386 ఎపిక్ కార్డులు ప్రింటింగ్ దశలో ఉన్నాయన్నారు. ఈ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తవుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

ఈవీఎంల పరిశీలన

కలెక్టరేట్ ఆవరణలోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్, డిప్యూటీ తహసీల్దార్ గణేష్ ఉన్నారు.

సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఈ నెల 14న మంచిర్యాలలో జరిగే సత్యాగ్రహ దీక్షకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యాప్తంగా హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారని, ఈ దీక్షకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రధాని మోదీ, ఆదానీల సంబంధంపై పార్లమెంట్‌లో లేవనెత్తడంతో రాహుల్‌గాంధీపై బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలతో, ఆత్మాభిమానాల కేసులు ఉన్న వ్యక్తులు చట్టసభల్లో ఉన్నారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ మతతత్వ విధానాలు అవలంబిస్తూ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలు ధాన్యం వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్ర జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 16నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో హాత్ సే హాత్ జోడో యాత్ర కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, నాయకులు కుక్కదువ్వు సోమయ్య, గుర్రాల శ్రీనివాస్, వల్లగురుల రఘుబాబు, చెరుకు అల్వయ్యగౌడ్, నూతి రమేష్, చిక్కుల వెంకటేశం, పాశం శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- భువనగిరిలోని దివ్యబాల విద్యాలయంలో ఏర్పాట్లు
- జిల్లాకు చేరిన జవాబు పత్రాలు
- 417 మంది ఉపాధ్యాయుల కేటాయింపు



దివ్యబాల విద్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి : పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో జవాబు పత్రాల మూల్యాంకనం, ఫలితాల వెల్లడికి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో తొలిసారిగా రెగ్యులర్ మూల్యాంకన కేంద్రాన్ని (స్పాట్ వాల్యుయేషన్) ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఈ కేంద్రంలో మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

దివ్యబాల విద్యాలయంలో..

మూల్యాంకన కేంద్రాన్ని భువనగిరి శివారులోని దివ్యబాల విద్యాలయంలో ఏర్పాటు చేశారు.గురువారం నుంచి 21వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగనుంది.ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్లు దిద్దనున్నారు. జిల్లాకు 1.20 లక్షల జవాబు పత్రాలు రానున్నాయి. ఇప్పటికే తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలు జిల్లాకు చేరుకోగా వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. సామాన్య, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి రెండు రోజుల్లో పూర్తిగా రానున్నాయి. వచ్చిన పేపర్లకు కోడింగ్ ప్రక్రియ చేపట్టారు. జవాబు పత్రాలను దిద్దేందుకు 17 గదులు కేటాయించారు. ప్రతి గదిలో 15 టేబుల్స్ ఏర్పాటు చేశారు. జవాబు పత్రాలను దిద్దడానికి, పర్యవేక్షణకు ఉపాధ్యాయులు, అధికారులను కేటాయించారు.

గతంలో నల్లగొండలో..

జిల్లాకు మూల్యాంకన కేంద్రం మంజూరుతో ఉపాధ్యాయుల ఇబ్బందులు తీరనున్నాయి. గతంలో నల్లగొండకు వెళ్లేవారు. ఇందుకోసం జిల్లా నుంచి 100 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది తొలగింది.

కేటాయించిన సిబ్బంది ఇలా..

జవాబు పత్రాలను దిద్దడానికి 417 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. పర్యవేక్షణకు అదనపు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు, ఏడుగురు అసిస్టెంట్ అధికారులు, 120 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ వ్యవహరించనున్నారు.

దూరభారం తగ్గింది



టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం కోసం భువనగిరిలోనే కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. గతంలో 60 కిలో మీటర్ల దూరం వరకు ప్రయాణం చేయవల్సి వచ్చేది. ప్రస్తుతం దూరం దగ్గరగా ఉండటం వల్ల శారీరకంగా ఇబ్బంది పడవల్సి అవసరం ఉండదు.

–వి.శ్రీరాములు, స్కూల్ అసిస్టెంట్, రెడ్లరేపాక

ఏర్పాట్లు పూర్తి చేశాం



మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటిసారిగా రెగ్యులర్ సమాధాన పత్రాలు మూల్యాంకనం చేయబడుతున్నాయి. ఇందుకు అనుగుణంగా అవసరం మేరకు అధికారులను నియమించాం. ఇప్పటికే ఏసీఓల సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు చేశాం.

–నారాయణరెడ్డి, డీఈఓ

రిజర్వేషన్ల ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి

- ఆర్టిఐ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు

భువనగిరి టౌన్ : రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షుడు దేవులపల్లి శేషగిరిరావు పేర్కొన్నారు. భువనగిరిలోని ఎస్‌వీ హోటల్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ బీసీ పరిరక్షణ సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నాయని వాపోయారు. గ్రామ పంచాయతీ స్థాయిలోనే రిజర్వేషన్లు ఉన్నాయని, చట్టసభల్లో కూడా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిందం కృష్ణ, మధు, శ్రీనివాస్, ప్రసాద్, శివకుమార్, చిరంజీవి, నవీన్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

రంజాన్ కానుకలొచ్చాయ్

- జిల్లాకు చేరిన 2,500 కానుకలు
- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇఫ్తార్ విందుల కోసం రూ.5 లక్షలు



జిల్లా సంక్షేమ కార్యాలయంలో కానుకల ప్యాకెట్లు

భువనగిరిటౌన్ : జిల్లాలో ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 2,500 గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా భువనగిరికి 1500, ఆలేరుకు వెయ్యి తోఫాలను కేటాయించారు. వీటిలో చీర, జాకెట్, పంజాబీ డ్రెస్ మెటీరియల్, లాల్చీ పైజామా క్లాత్ ఉంటాయి. అంతేకాకుండా ఇఫ్తార్ విందుల కోసం భువనగిరికి రూ.3 లక్షలు, ఆలేరుకు 2 లక్షలు కేటాయించారు.

నేటినుంచి ఇఫ్తార్ విందులు

అన్ని మండల కేంద్రాల్లో గురువారం నుంచి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయనున్నారు. ఇఫ్తార్ అనంతరం గిఫ్ట్ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తక్కువగా వచ్చాయంటున్న ముస్లింలు

జిల్లాలో ముస్లిం జనాభా 27,926 మంది ఉన్నారు. కానీ, ప్రభుత్వం కేవలం 2,500 గిఫ్ట్ ప్యాక్‌లు మాత్రమే పంపించింది. దీంతో చాలా మందికి కానుకలు అందే పరిస్థితి లేదు. గ్రామాల్లో తోఫా పంపిణీ బాధ్యతలను మజీద్ కమిటీలు, మత పెద్దలకు అప్పగించారు. అవసరం మేరకు కానుకలు రాకపోవడంతో పంపిణీ సందర్భంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. తమ జనాభా ప్రకారం కనీసం 70 శాతం కుటుంబాలకైనా పంపిణీ చేయాలని పలువురు ముస్లింలు కోరుతున్నారు. అంతేకాకుండా అదనపు కానుకలు అందుతాయన్నాయని విమర్శలు ఉన్నాయి.

జాబితా సిద్ధం చేశాం



జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఇఫ్తార్ విందుల ఏర్పాటు చేయడంతో పాటు రంజాన్ కానుకలను పంపిణీ చేస్తాం. ఇప్పటికే గిఫ్ట్ ప్యాకెట్లను ఆయా మండల కేంద్రాలకు చేరవేశాం. అర్హుల జాబితాను కూడా సిద్ధం చేశాం. మజీద్ కమిటీలు, ముస్లిం మత పెద్దలు కానుకలను పంపిణీ చేస్తారు.

–యాదయ్య, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

పేద ముస్లింలందరికీ ఇవ్వాలి



మూడు శాతం కుటుంబాలకు మాత్రమే రంజాన్ కానుకలు వచ్చాయి. వీటిని పంపిణీ చేయాలంటే మజీద్ కమిటీలు, మత పెద్దలకు ఇబ్బందిగా మారనుంది. పేదలందరికీ కానుకలు అందజేయాలి. ముందస్తుగానే అర్హుల జాబితా తయారు చేయాలి. ఇష్టం వచ్చినట్లు ఇవ్వొద్దు.

–ఎండీ జహంగీర్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

27వ రోజు నిర్వాసితుల దీక్ష

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్‌తండా వాసులు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చేపట్టిన దీక్ష 27వ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా 200 ఎకరాలకు పైగా భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే దాతరుపల్లిలోని 294 సర్వే నెంబర్‌లో పునరావాసం కల్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంత్యానాయక్, రవినాయక్, బిచ్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.



బస్వాపురం రిజర్వాయర్ వద్ద దీక్ష చేస్తున్న లప్పానాయక్‌తండా వాసులు

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యం



ఆత్మకూరు(ఎం)లో డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభిస్తున్న గొంగిడి సునీత

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం), తుర్కపల్లి : రాష్ట్రంలో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆత్మకూర్(ఎం), తుర్కపల్లి మండల కేంద్రాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను బుధవారం ఆమె ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం తీసుకువచ్చారని పేర్కొన్నారు. కులాలు, పార్టీలకతీతంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదల బాగు కోరుతున్న సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. తుర్కపల్లిలో ఇంకా 11 ఇళ్లు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే అర్హులకు కేటాయిస్తామని చెప్పారు. ఆత్మకూర్(ఎం)లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా, సర్పంచ్ జన్నాయికోడి నగేష్, ఎంపీటీసీ యాస కవిత, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, రైతు సమితి డైరెక్టర్లు కోరె బిక్షపతి, బీసు ధనలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యులు యాదగిరి, తుర్కపల్లిలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్నూ చందర్‌గౌడ్, జెడ్పీటీసీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మన్ నర్సింహులు, ఎంపీటీసీ బోరెడ్డి వసంతాసత్యంరెడ్డి, ఉప సర్పంచ్ తలారి హేమలత శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో నిందితుడి రిమాండ్

పాలకవీడు: మండల పరిధి మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ భవానీపురంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన చిమట వెంకన్న తన ట్రాక్టర్‌తో అక్రమంగా సిమెంట్ పరిశ్రమ బౌండరీ గోడ కూల్చివేశాడు. అడ్డుకున్న పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. ఈ మేరకు పరిశ్రమ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ నవిలె గోపీకుమార్ ఫిర్యాదు మేరకు వెంకన్నను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సైదులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

మోటకొండూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తేర్యాల గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామానికి చెందిన ఇంద్రాల రాములు(53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాములు మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద కల్లు తేవటానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయలుదేరాడు. రాత్రి అవుతున్నా రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ లభించలేదు. ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బురద మడిలో విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఐలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాగి మధుసూదన్ తెలిపారు.

బీరులో నాచు

మోత్కూరు : మద్యం వినియోగదారుడు బీరు కొనుగోలు చేయగా అందులో నాచు వచ్చింది. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఓ వైన్స్‌లో బుధవారం ఆరెగూడెం గ్రామానికి చెందిన శ్యామల నర్సిరెడ్డి ఓ కంపెనీకి చెందిన రెండు బీర్లను రూ.300లకు కొనుగోలు చేశారు. మూత తీసి తాగడానికి ప్రయత్నించగా అందులోని ఓ బీరులో నాచు, చెత్త కనిపించాయి. మరో బీరులో కూడా అలానే ఉండడంతో సీలు తీయని బీరు సీసాను తీసుకొచ్చి మద్యం దుకాణం నిర్వాహకుడికి చూపించారు. దీంతో సీల్ తీయని బీరు తీసుకొని మరో బీరు ఇచ్చాడు.

పాము కాటుతో గేదె మృతి

గుండాల : పాము కాటుతో గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వస్తాకొండూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన తాటిపల్లి రజిత ఇటీవల మహిళా సంఘంలో రుణం పొంది గేదెను కొనుగోలు చేసింది. బుధవారం వ్యవసాయ బావి వద్ద గేదె మేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన ఆమె గుండాల పశువుల డాక్టర్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ చికిత్స అందించే క్రమంలోనే మృతిచెందినట్లు వాపోయింది.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- గులాబీ జెండా అందరికీ అండ
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తోందని పేర్కొన్నారు . బుధవారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని కుడకుడ, కోమటికుంటకు చెందిన 100మంది యువకులు కాంగ్రెస్, బీజేపీలను వీడి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్లలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింతగా బలోపేతం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గ్రామాలు, పణాలలో ప్రజల సమస్యలు పరిష్కారానికి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. గతంతో పోలిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కండ్లముందే కనిపిస్తున్నదన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ సైదులు, మాజీ మార్కెట్ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

చివ్వెంల(సూర్యాపేట) : రోడ్డు పక్కన గుడిసెలో నివసిస్తున్నపేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన రోడ్డు పక్కన పూరి గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు చూసి చలించి పోయారు. వెంటనే కాన్వాయ్ దిగి వారి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు ఇల్లు నిర్మించుకోవాడానికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుకోని అతిథి ఇంటి ముందుకు వచ్చి ఇల్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు ఆవుల అంజయ్య, ఆవుల లింగయ్య మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేతలకు ప్రచార అస్త్రంగా 'బలగం'

- పోటాపోటీగా గ్రామాల్లో సినిమా ప్రదర్శన
- ప్రజలకు గుర్తుండిపోయేలా నాయకుల ప్రయత్నాలు

మునుగోడు: కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిన బలగం సినిమా రాజకీయ పార్టీల నాయకులకు ప్రచార అస్త్రంగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల జీవన స్థితిగతులే ఇతివృత్తంగా చిత్రీకరించిన ఈ సినిమాను చూడాలనే కోరిక గ్రామాల్లోని ప్రతి ఒక్కరిలో మొదలైయింది. కానీ, గతంలో మాదిరిగా మండల కేంద్రాల్లో సినిమా థియేటర్లు లేకపోవడం, గ్రామాల నుంచి జిల్లా కేంద్రాలకు వచ్చి సినిమా చూసే ఆర్థిక స్థోమత లేని పేదలు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ రాజకీయ నాయకులు సొంత డబ్బులు ఖర్చుచేసి గ్రామ ప్రధాన కూడలిలో రాత్రి సమయంలో సినిమా ప్రదర్శించి అందరికీ గుర్తుండిపోయేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.10 వేలతో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన..

బలగం సినిమాను ప్రదర్శిస్తే గ్రామస్తులు తమను గుర్తుపెట్టుకుంటారని రాజకీయ పార్టీల నాయకులు రూ.10వేలు ఖర్చు చేసి ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. సాధరణంగా సినిమా థియేటర్‌లో ఒక్కరు సినిమా చూస్తే రూ.100 టికెట్ తీసుకొని చూడాల్సి ఉంటుంది. అదే సినిమా నాయకులు తమ గ్రామంలో ఉచితంగా పదర్శిస్తుడంటంతో కుటుంబ సభ్యులు అంతా వెళ్లి వీక్షిస్తున్నారు. ఆ సినిమా చూసేందుకు వచ్చిన ప్రజలందరికీ కుటుంబాలు కలిసి ఉండాలని సందేశాలు ఇచ్చి ప్రదర్శిస్తున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ఇప్పటికే దాదాపు 15కు పైగా గ్రామాల్లో సినిమాను ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన చల్లమల్ల కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిలు పలు గ్రామాల్లో పదర్శింపజేశారు. వారితో పాటు మరికొందరు సంపన్న కుటుంబాల వ్యక్తులు చనిపోయినా వారి స్మారకార్థం గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఏది ఏమైనా బలగం సినిమా రాజకీయ పార్టీ నాయకులకు ప్రచార ఆయుధంగా మారిందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

హాలియా : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. హాలియా, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుపాషిపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె ఉస్మాన్(23) రోజువారి కూలీ పని నిమిత్తం ఉదయం 5.30 గంటల సమయంలో తన ఇంటి నుంచి బైక్‌పై నల్లగొండకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో పులిమామిడి నుంచి ఇసుకను తరలిస్తూ కుమ్మరికుంట (కేకే కాలువ) వైపు అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మారేపల్లి గ్రామ శివారులోని ఉస్మాన్ ప్రయాణించే బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఎస్‌కె ఉస్మాన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఎస్‌కె ఇమాంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ..

చిట్యాల: చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఎదుళ్ల శేఖర్‌రెడ్డి(55) గ్రామ శివారులోని గాంధీ గుడి వద్ద గల వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు శేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కారు నడుపుతున్న వ్యక్తి సైతం గాయపడ్డాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాభంధనం, రుత్విగ్వరనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

నీలగిరిలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన పలు ఇళ్లలో నలుగురు ముఠా సభ్యుల చొరబాటు
- సొత్తు లభించకపోవడంతో వెనుదిరిగిన వైనం
- ఇనుపరాడ్లు, ఆయుధాలతో సంచారం
- సీసీ ఫుటేజీల్లో రికార్డయిన కదలికలు

నల్లగొండ క్రైం : నీలగిరి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు హల్‌చల్ సృష్టించారు. నలుగురు వ్యక్తులు గల ఓ ముఠా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఆయుధాలతో సంచరించింది. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్‌లో జీ8 ఫ్లాట్, బృందావన్‌కాలనీ, విశ్వనాథ కాలనీల్లో తాళాలు వేసిన పలు నివాసాల్లోకి చొరబడి సోదాలు నిర్వహించారు. అయితే, ఆ ఇళ్లలో ఎలాంటి సొత్తు లభించకపోవడంతో నిరాశతో వెనుదిగారు. ఓ దొంగ అపార్ట్‌మెంట్ కింద ఉండగా ముగ్గురు వ్యక్తులు నివాసాల్లో చొరబడి సోదాలు నిర్వహించారు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. వాకింగ్ వెళ్లే వారు చూసి గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని సమాచారం ఇవ్వడంతో అప్పటికే దొంగల ముఠా పారిపోయింది. పోలీసులు, సీసీ కెమరాల ఫుటేజీ, వేలు ముద్రలను సేకరించారు.అంతరాష్ట్ర దొంగల ముఠాగా భావిస్తున్నారు. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి : ఎస్పీ

దొంగల ముఠా సంచారంపై పోలీస్ నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ అపూర్వరావు అధికారులను ఆదేశించారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా నిఘా వ్యవస్థతో పాటు పెట్రోలింగ్ చేయాలని యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దొంగల ముఠా కదలికలపై ఫోన్ లొకేషన్, సీసీ కెమరాల ఆధారంగా ఎటు వైపు వెళ్లారు? ఏ ప్రాంతానికి చెందిన వారో గుర్తించాలన్నారు. రైల్వేస్టేషన్, జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్న పోలీస్ అధికారులు మరింత నిఘా పెంచాలని సూచించినట్లు తెలిసింది.

రుణాలు మంజూరు చేయడం లేదని..

- సహకార సంఘానికి తాళం వేసిన రైతులు


సహకార సంఘ కార్యాలయ గేటుకు రైతులు వేసిన తాళం

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబెల్లి సహకార సంఘంలో అర్హులకు రుణాలు మంజూరు చేయడం లేదని బుధవారం అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ సహకార సంఘం కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం డీసీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత చైర్మన్, సీఈఓ దీర్ఘకాలిక రుణాలైన డైరీ రుణాలు మంజూరు చేయడంలేదని, 23 మందిలో 20 మందికి రుణాలు మంజూరు చేసి, మిగతా ముగ్గరికి మొండిచేయి చూపారని తెలిపారు. లంచం ఇస్తేనే రుణాలు మంజూరు చేస్తామంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. తమకు తక్షణమే రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు బడేటి లింగమ్మ, వీరబోయిన నాగమణి, బుర్రా సతీష్ ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

భువనగిరి : రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, భువనగిరి న్యాయవాదుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు రాజ్యాంగం- పౌరుల హక్కులు విధులు అంశంపై అవగాహన కల్పించేందుకు పట్టణంలోని జిల్లా కోర్టు నుంచి రాయగిరి ఎక్స్ రోడ్డు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. హక్కుల సాధనతో పాటు విధుల నిర్వహణ బాధ్యతలను చేపట్టాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, కేశవరెడ్డి, ట్రాఫిక్ సీఐ సతీష్,జితేందర్‌రెడ్డి, వెంకటేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అనాజిపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ, ఎంపీపీ

పెన్‌పహాడ్ : రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సుందరి కిరణ్‌కుమార్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్యలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనాజిపురం, సింగారెడ్డిపాలెం, దూపహాడ్, భక్తాళాపురం గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పంటలకు మద్దతు ధర కల్పించి రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చడానికే కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, మండల వ్యవసాయ అధికారి కృష్ణసందీప్, ఏపీఎం అజయ్ నాయక్, ఆర్‌ఐ స్వప్న, సర్పంచ్‌లు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, షరీఫుద్దీన్, భిక్షం, ఎంపీటీసీ గద్దల నాగరాజు, ఏఈఓలు సంధ్య, గోపి, వెలుగు సీసీలు ఐతరాజు చెన్నయ్య, సైదులు, సంఘ బంధం సభ్యురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- నల్లబెల్లం, పటిక, సారా పట్టివేత
- ఐదుగురు సారా విక్రేతల అరెస్ట్


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటిక, సారా, వాహనాన్ని పట్టుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లో మంగళ, బుధవారాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 630 కేజీల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 35 లీటర్ల సారా, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతునున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు సతీష్ కుమార్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది నాగరాజు, రవి, నాగయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- నలుగురు కార్మికులకు స్వల్ప అస్వస్థత
- రూ.50లక్షల ఆస్తినష్టం


పెద్దకందుకూరు గ్రామంలోని పరిశ్రమలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని డీసీ-1 బ్లాక్‌లో కార్మికులు మ్యాన్యువల్‌గా పనులు చేస్తుండగా ఈ మంటలు చెలరేగాయి. దీంతో ఆ బ్లాక్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులు భయంతో బయటికి పరుగులు తీసారు. వెంటనే పరిశ్రమ నిర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయగా వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, నలుగురు కార్మికులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని, రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. అస్వస్థతకు గురైన కార్మికులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, టెంపరేచర్ ఎక్కువ కావడంతోనే ప్రమాదం జరిగిందని పలువురు కార్మికులు చెబుతుండగా, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని కంపెనీ యాజమాన్యం పేర్కొంది.

డబుల్ ధమాకా




అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామానికి చెందిన మార్తె సైదులు, నాగమ్మ దంపతులు సాకుతున్న ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. రెండు మగ దూడలు ఒకే రూపంతో ఉన్నాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని పశువైద్యులు, గోపాల మిత్ర తెలిపారు.

నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధం


మద్దిరాల : నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న జమాయిల్ మొక్కలకు అంటుకుని వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పలు మొక్కలు దగ్ధమైనట్లు తెలిపారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- ..లేకుంటే పండించిన పంటలో 10నుంచి 20శాతం నష్టపోయే ప్రమాదం
- పెద్దవూర ఏఓ సందీప్


సందీప్, ఏఓ పెద్దవూర


ఆరబోసిన వడ్లు



పెద్దవూర : యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపరుచుకోవాలో తెలియక రైతులు తికమక పడుతుంటారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాలుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు.. మండల వ్యవసాయ అధికారి సందీప్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరిస్తున్నారు. ధాన్యం నూర్పిన తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరి కోతలు కోపించేవారు. ప్రస్తుతం రైతులు కూలీలపై ఆధార పడకుండా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట పచ్చగా ఉన్నప్పుడే వరికోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఉంటే అవకాశాలు మెండుగా ఉంటాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చేదాక చూసుకోవాల్సి ఉంటుంది. ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతే కాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు

ముక్క పురుగు : పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక : ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పైపొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యాన్ని వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల ద్వార నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.